శ్రీ

భాసమహాకవికృత

కర్ణభారము

ఆంధ్రీకర్త:

విద్వత్కవిభూషణ

విద్వాన్ వేదము వేంకటకృష్ణశర్మ.

శ్రీ

భాసమహాకవికృత

కర్ణభారము

ఆంధ్రీకర్త:

విద్వత్కవిభూషణ

విద్వాన్ వేదము వేంకటకృష్ణశర్మ.

PRINTED
AT THE VAVILLA' PRESS
MADRAS—21

కృతిపతిప్రశంస

పంకాలిదూర! వాణిప
శంకర! బహుసుకృతికృతయశస్కర పటుని
శ్శంకహృదయ! పిల్లలమఱి
వేంకట హనుమంతరాయ! విద్వద్గేయా.

సఖ! ప్రభుత్వసమాచారశాఖలోద్వి
భాషివై కొన్నినాళ్లుండి పాటువడితి,
వరయ హిందూకళాశాల నాంధ్రభాష
బోధకుండయి సత్కీర్తిఁ బొందె దిపుడు.

ఆవినయమ్ము, విజ్ఞతయు నాదరణమ్మును సద్విమర్శనా
భావము శ్రీనివాసపదపంకజసేవయు, నాత్మబంధుసం
భావనదీక్ష నీకు సరివచ్చెడువా రెవరాంధ్రభూమి? పుం
భావసరస్వతీ! విమలభావకవిత్వధురంధరాగ్రణీ.

ఎవ్వానితల్లి సమీహితనిజభర్త్రి
ధీన యా పుణ్యవతీమతల్లి
ఎవ్వానితండ్రి మహేశ్వరభక్తుఁడై
తనరు సుబ్రహ్మణ్యధన్యతముఁడు
ఎవ్వానిమామ యై యొసలారెఁ గుఱుగంటి
కులుఁడు సీతారామ కోవిదుండు,
ఎవ్వానిపత్ని యై నివ్వటిల్లు సుశీ
లాదేవి సుకృత ముల్లసిలుదీవి,

పొదలఁగా సర్వమంగళప్రద, త్రిమూర్తి,
పుణ్యశీల, శ్రీకళ, శారదాన్యసుతలు
అరయ వాచస్పతియు విద్యాధరుఁడును
ఎవనిసంతానసంపద లవని వెలయు.

అతఁ డాంధ్రసాహిత్యమందు నగ్రశ్రేణి
నెనసి ఎం, ఏ, పట్టమును గ్రహించె,

అతఁడు సికింద్రబాదందు నిర్మించె సా
ధనసమితి యనంగ వినుతసంస్థ,
అతఁడు సంపాదకుఁ డయి సంచికను గూర్చె
నమరవాక్సమ్మేళనమున నెలమి,
అతఁడు గుంటూరునం దంత జ్యోత్స్నాసమా
జము, శారదాపీఠ మమరఁ జేసె.
కవియు, కథకుఁడు, నాటికాకారుఁడును, వి
మర్శకుఁడు, గాయకుఁడు, వక్త, దర్శకుండు
నటుఁడు నయి యాంధ్రదేశమ్ము నాల్గుదెసల
ప్రథ గనె నతఁడు హనుమంతరాయసుకవి.

మల్లంపల్లియు సీరిపి, పిల్లలమఱి కవులశిల్ప వివిధరచనముల్
గొల్లగొనె నాదుమదికళ, లెల్లోరా బౌద్ధశిల్ప హేవాకములో.

విద్వత్కవిభూషణకవి, సర్వనుతకవీంద్ర భాసమ్యగ్రచితం
బద్వితయకర్ణభారం, బుద్వేలయశమ్ము నించు నుర్విసతంబున్.

ఎపుడు గుంటూరుఁ జేర నింటిల్లిపాది
సుహితునట్టులు, గురువట్లు, చుట్టమట్లు
నతిథులకు మించు సత్కృతు లాచరించి
ఎలమి గనువారిఋణము లే నెట్లు దీర్తు.

అర్ఘ్యమునకు నీరాజన
కార్యమటులు కృతిని దీనిఁ గైకొను మని యౌ
దార్యమున నొసఁగఁజూచుట
యార్యా! త్రోయకయ కొనుమ యభ్యుదయమగున్.

ఓహో! హనుమ యెదురఁ గో
లాహలమునఁ గుప్పిగంతులను వేయుటయా?
సాహిత్య విమర్శనముల
శ్రీహనుమద్రాయు నెదురఁ బ్రేలుట గాదా!

కనుకణ నిలిపెదనింతట, కనుకను మీభావిభాగ్య కల్యాణములో
కనుకనక నెందు నీవీఁ, కనుజగ మరసి ముదమందుకరణిఁ ధరణిన్.

అవతారిక

విశ్వవిఖ్యాతి గడించిన పూజ్యులగు గీర్వాణవిద్వత్కవీంద్రుల ప్రస్తుతికిఁ బాత్రుఁడయిన భాసమహాకవి, బృహత్కథారామాయణ మహాభారతములలోని కథావస్తువుల నాధారపఱచికొని యీ క్రింది పదుమూఁడు నాటకములు రచియించినట్లు తెలియుచున్నది.

బృహత్కథనుండి:— ౧. ప్రతిజ్ఞాయౌగంధరాయణము, ౨. స్వప్నవాసవదత్తము, ౩. అవిమారకము.

రామాయణమునుండి:— ౧. అభిషేకము, ౨. ప్రతిమా.

మహాభారతమునుండి:— ౧. మధ్యమవ్యాయోగము. ౨. పాంచరాత్రము, ౩. దూతవాక్యము, ౪. దూతఘటోత్కచము. ౫. కర్ణభారము, ౬. ఊరుభంగము.

శ్రీకృష్ణచరిత్రమునుండి:— ౧. బాలచరిత.

జానపదకథలనుండి:— ౧. చారుదత్తము.

భాసనాటకవైఖరి.

భాసుఁడు తనకు ముందలివాఁడని బాణకాళిదాసు లంగీకరించినట్లు, అతనింగూర్చి వారు నుడివినశ్లోకములు సాక్ష్యము లిచ్చుచున్నవి.

సునిశితముగ నీతని నాటకములం బరిశీలించుచో ననేకాంశములం దన్నిటను నొకేవిధముగఁ గన్పట్టెడు. నాటకములన్నియు 'నాన్ద్యన్తే ప్రవిశతి సూత్రధారః'—అను వాక్యముతో నారంభించును. ఆశీర్వచన పద్యము పఠించినతరువాత, సూత్రధారుఁడు పూర్వరంగ ప్రస్తావ మొనర్చును. కాని, లాక్షణికనాటకములు సాధారణముగ— 'తతః ప్రవిశతి సూత్రధారః'—అను వచనముతో సూత్రధారుఁడు సభకుఁ బరిచయము చేయఁబడును. మఱియొండు విచిత్ర మేమన, రంగప్రవేశ సందర్భమునందు, అన్నిరూపకములలోను 'అన్తే'—'తతః'—అను శబ్ద

ములు పునరుక్తము లగును. సహజముగఁ గృతికర్తయొక్కయు, భర్త యొక్కయుఁ బేళ్లుసూచించుపద్ధతి భాసనాటకములలోఁ గనిపింపదు. పూర్వరంగము తలచుగఁ 'బ్రస్తావన'—అనఁబడుట, లాక్షణికసమ్మత మయినను, ఇందు 'స్థాపన'—యని యుటంకింపఁబడును. ఏతత్కవిప్రణీత దృశ్యకావ్యములందెల్ల—'భరతవాక్య'—మొకరకముగనే యుండును. శైలీభాషలుగూడ సమానముగ జాలువాఱును. ఈతనిరూపకములెల్ల, అనుద్దిష్టప్రతివచనములు, అనవసర పతాకాస్థానములు, అభూతాలంకార విశేషములు మున్నగునవి మొదటిశ్లోకముననే మెదలాడుట గమనింపఁ దగును. ఉపపాత్ర నామధేయ పునఃపునరుద్ఘాటనములు, సక్రమరహిత వ్యాకరణదోషములు, అసమాశయవాక్యవ్యక్తీకరణములు అన్నినాటకములలోఁ బలుమఱు దృగ్గోచరము లగుచుండును. భరతమునినాటక లక్షణసూత్రము లేమాత్ర మీభాసనాటకములకు వర్తింపవు. ద్వంద్వ యుద్ధములు, మహాసంగ్రామములు, మరణములు రంగప్రదేశములలో విచ్చలవిడిగఁ జూపఁబడును. రంగప్రసాధనాదు లనేకములు, పాఠక ప్రేక్షకులు— చదివియు — చూచియు నూహించి నిర్ణయించుకొనవలెను. సూచన లత్యంత సంగ్రహరూపములు. ప్రవేశకనిష్క్రమణము లెంతయుఁ ద్వరితములు. నాటకప్రఖ్యలు కడపటనే కనిపించును. పైని వివరించిన యంశములు సుస్పష్టసాజాత్యప్రకాశకము లగుట భాసకవియే యన్నిరూపకములకుఁ గర్తయనుటయం దిసుమంతయు విప్రతిపత్తి గానరాదు.

పాణినివ్యాకరణసూత్రములుగాని, భరతునినాటకలక్షణములుగాని ఈనాటకములలోఁ బాటింపఁబడ లేదు. దానింబట్టి, యట్టిసూత్రములు లక్షణములు ఉప్పతిల్లుటకుముందే, యవి రచియింపఁబడినవని పరిశోధకుల యభిప్రాయము.

భాసుఁడే కర్త.

శ్లోకములలో నడుగడుగునకు—'తు'—'చ'—యను శబ్దము లనవసరములుగ నుపయోగింపఁబడుటయుఁ, బెక్కుశ్లోకము లనుష్టుప్

ఛందస్సు నాశ్రయించి వెలయుటయు, నుద్దిష్టభావప్రకటనమునఁ దగిన నైపుణ్య మెసలారమియు, రామాయణమహాభారతాద్యుత్కృష్టకావ్యములంబలె లాక్షణికాలంకారికముల కంతసమీచీనములు సాన్నిహిత్యములు గాకుండుటయు భాసనాటక ప్రత్యేకగుణములు. కావుననే యవి తదుత్తరరూపకములకంటె విభిన్నము లయినవి. అంతియగాక, యిమ్మహాకవిప్రణీతము లని చెప్పఁబడు పదుమూఁడునాటకములలోని యభిప్రాయములు చాలవఱకు—కాళిదాసు, అశ్వఘోషుఁడు, శూద్రకుఁడు, విశాఖదత్తుఁడు మున్నగు మహాకవుల కృతులలో అగపడుచున్నవి. భాసనాటకములలో నొకటి యగు 'స్వప్నవాసవదత్తము'—లోని దని రాజశేఖరకవి యీక్రింది శ్లోకము నుటంకించెను:—

"భాసనాటకచక్రే ఽపిచ్ఛేకైః క్షి ప్తేపరీక్షితుమ్,
స్వప్నవాసవదత్తస్య దాహకో ఽభూన్న పావకః."

(సూక్తిముక్తావళి.)

పై రెండుపాదములు చక్కఁగఁ బరిశీలించుచో,నవి భాసమహాకవివే యనుట నిర్వివాదాంశము. 'నాటకచక్రము'న కతఁ డేక గర్త గాకుండు టెట్లు? ఇదివఱకే విమర్శకు లీవిషయముం దేల్చిరి. కాన, వానింగూర్చి విపులీకరించుట చర్వితచర్వణ మగును. అనేకగాథలు, మహద్విషయములకు సంబంధించిన యమూల్యాంశములను సూచించుచు, బహుళపాత్రోపేత నాటకవస్తువులను, రంగప్రసాధన సాధనములను బరిగ్రహించి, ప్రదర్శన యోగ్యసన్నివేశములను గల్పించి రూపకకళ కొక రూపమొసంగినందుననే, భాసమహాకవి ప్రఖ్యాతిమిన్నందుకొన్నదని బాణుఁడు తన హర్షచరిత్రమునఁ దెలిపియున్నాఁడు.

పైసాదృశ్యములన్నియుఁ దిరువేంద్రమున లభించిననాటకములలోనెల్లఁ గానవచ్చుటచేతనే, యవిభాసకృతము లని నిర్ణయింపవీలగుచున్నది. ఏతద్రూపకవ్రాత పౌర్వాపర్యములను దృష్టిలోనుంచికొనియే, కాళిదాసు భాసునిఁ దనకు ముందటివానిఁగఁ బేర్కొనెను.

ఈదృశ్యకావ్యములన్నియు నేకకర్తృకములే యను నంశమునఁ బెక్కురు పండితు లేకీభావముం గలవారే. ఈవిషయమున మనకుఁ గనఁబడు భిన్నాభిప్రాయములు మూఁడు:—

1. పదుమూఁడునాటకములును భాసకవికృతములు. 2. అం దేదియు భాసునిది గాదు. 3. ఈ త్రిదశసంఖ్యాప్రగుణమునకుఁ జాలినంత సాధనసంపత్తి లేదు. ఇంతవఱకు లభించినవి యసంపూర్ణములే.

వాఙ్మయనిష్ణాతులు తమ తమ యభిప్రాయములను సమర్థించుకొనఁ బ్రకటించిన యంశములు:—

(అ) బాణుని శ్లోకమున సూచింపఁబడిన భాసకవినాటకధోరణులు చాలవఱకు దక్షిణదేశప్రతులలోను జూపట్టుచుండుటచే, నవి యసమగ్రములగు నుదాహరణము లని భావింపఁదగును.

(ఆ) రామచంద్రకవి తన నాట్యదర్పణమున, నాటకవర్గమునకుఁ జెందిన క్రిందిశ్లోకము భాసకృత స్వప్నవాసవదత్తములోనిది కా దని వక్కాణించెను. కాన, భాసనాటకము లని చెప్పఁబడువానిలో నేదియు నాతనిది గాదు.

"పాదాక్రాన్తాని పుష్పాణి సోష్మ చేదం శిలాతలమ్,
నూనం కాచిదిహాసీనా మాందృష్ట్వా సహసాగతా."

పై నుడివిన ద్వివిధాభిప్రాయములతో నేకీభవించని పండితవరేణ్యులొక కొందఱు ముందుజాగ్రత్తతో సహజముగ మూఁడవయభిప్రాయమునే బలపఱచిరి. ఒందు రెండువర్గముల వా రొకపెడగను, మూఁడవతెగవా రొకపెడగను ఏర్పడి, ప్రతిపక్షసమూహా పూర్వపక్షసిద్ధాంతములలోని లోపములనుగూర్చి వాదించుచు, నట్టివి నిస్సారము లని తేల్చుట కెన్నియో వ్యాసములను బహుళపత్రికాముఖముల వెలువఱించుచుఁ జాలకాలము పోరాడి, స్వస్వాభిప్రాయములే సరియయిన వని చాటఁబూనిరి. కాని దీనివలన గ్రంథకర్తృత్వముం దేల్చి, యిదమిత్థ మని నుడువుటయే క్లిష్టసమస్యగఁ బరిణమించినది. కనుక, ఈనాఁటివఱకు ఈ విషయము సందిగ్ధావస్థలోనే యుండిపోయినది.

భాసకవికాలము

ఇంతకుముందుఁ బరామర్శించి వ్రాసికొనిన చొప్పున భాసమహాకవి, కాళిదాసబాణకవులకుఁ బూర్వుఁడనియు, (ప్రతిమా, అభిషేకనాటక కథావస్తుగ్రహణముచే)అతఁడు వాల్మీకి మహర్షికి వెనుకటివాఁ డనియుఁ దెలియుచున్నది. కాని, యీనాఁటివఱకును కాళిదాసునికాలమే యింకను దేలకున్నది. డాక్టరు పీటర్సను చెప్పినట్లు, కాళిదాసు క్రీస్తుశకారంభమున జీవించియుండెనేని, భాసుఁ డాతరువాత నుండినవాఁ డనుట పొసఁగదు. డాక్టరు కెర్ను అతనిని క్రీ. శ. 6-వ శతాబ్దిపూర్వార్ధమున నున్నవానిఁగా నెన్నెను. బాణకవి క్రీ. శ. 6-వ శతాబ్దాంతమునను, 7-వ శతాబ్దాదిని వెలసెనని యుగ్గడించుట విస్పష్టము. దీనింబట్టి యేలాగునఁ జూచినను, భాసునికాలము క్రీ. శ. 6-వ శతాబ్దిని మించిన దనుట నిక్కువము. వాల్మీకిమహాముని కాలమునుగూర్చి సైతము విద్వదవతంసులలో వివిధాభిప్రాయములు విలసిల్లెడు. ప్రొఫెసరు కీతు క్రీ. శ. కు ముందు నాల్గవశతాబ్దమున వాల్మీకి జీవించియుండినట్లు వక్కాణించెను. ఆతరువాతివా రాతనివాదము నాధారపఱచికొని, క్రీ. శ. 400-200 ల మధ్యగ నుండు ననిరి. ప్రొఫెసరు జాకోబి క్రీ. పూ. 5-వ శతాబ్దమే వాల్మీకి జీవితకాల మని నిర్ణయించెను.

మొత్తముమీఁద, వాల్మీకి కాళిదాస మధ్యకాలావధుల పొలిమేరలను భాసమహాకవిజీవితకాలము దాఁటిపోవ దని పెక్కురు విమర్శకుల యాశయము. కాని, అతని సరియయిన(కచ్చితమయిన)జీవితకాలముం గూర్చి పరిశోధకులలోఁ బలువు రింకను నిరాతంకముగ, నిస్సంశయముగ, నిరాఘాటముగ నేకోన్ముఖాభిప్రాయమున వెలువఱింపఁజాలకున్నారు. కొంద ఱతనిఁ గాళిదాసునకు సన్నిహితుఁ డని, మఱికొందఱు వాల్మీకికి సమీపస్థుఁ డని యనుచున్నారు. తిరువేంద్రమునందలి భాసనాటకగ్రంథ ప్రచారకు లగు పండితులు, భాసనాటకములలోఁ బాణినివ్యాకరణ సూత్రానుగుణ ప్రయోగములుగాని, భరతుని నాటకలక్షణాదర్శములుగాని మచ్చునకైనఁ గనఁబడమి,—వా రిరువుర కతఁడు ముందే యుండి

యుండునని విశదీకరించిరి. ప్రొ. కీతు వాదానుసారము భాసుఁడు నాల్గవ శతాబ్దివాఁ డగుచో, నతనికిఁ బిమ్మటివాఁ డగు పాణిని, క్రీ. శ. 5-వ శతాబ్దివాఁ డనుట సత్యదూరము కాదు.

భా స మ హా క వి జీ వి త ము

భాసునిజీవితవిశేషములనుగూర్చి తెలియవచ్చు నంశములు చాల స్వల్పములు. ప్రాచీనరచయిత లయిన వ్యాసవాల్మీక్యాది మహర్షివర్గమున కాతఁడు చెందినవాఁడు. వైష్ణవసిద్ధాంతములం దతఁ డత్యంత మభిమానముగలవాఁడు; బ్రాహ్మణాచారవ్యవహారములన్నఁ జెవిగోసికొనువాఁడు. భాసుఁడు తఱచుగ బ్రాహ్మణుల యాధిక్యమునుగూర్చి తనకృతులలోఁ దడవుటచే,—బ్రాహ్మణుఁను, వారిధర్మనిపను నాతఁడు పరమోత్కృష్టములుగ భావించువాఁ డని యెఱుకవడెడు. అతఁడు బాలచరిత్రమునఁ గంసునిచే నిశ్చలముగ నిట్లు చెప్పించును:—'బ్రాహ్మణుఁ డసత్యము వచించినను, దానిని నేను సత్య మనియే (దృఢముగ విశ్వసించి) స్వీకరింతును.'—అని. ఈకర్ణభారముననే—"బ్రాహ్మణవచనమితి, న మయాతిక్రాన్తపూర్వ"—మ్మని కర్ణునినోటఁ బలికించుచు—'విప్రవాక్యము ననుసరించి' — తా నింద్రప్రేషితమగు శక్తిని స్వీకరించునట్లు వక్కాణింపఁజేసెను. గృహిణులకు గృహములే యుచితవాసస్థలములని భాసుని యుద్దేశము.

ధర్మోద్ఘాటనమున భాసుఁడు గడుంగడుఁ దీవ్రవాది. 'ధర్మోరక్షతి రక్షితః'—అను న్యాయమునం దతఁడు అత్యంతప్రత్యయమున్నవాఁడు. కావుననే 'ప్రతిజ్ఞా'నాటకమున యౌగంధరాయణునిచే—'భూమిర్భర్తారమాపన్నా రక్షితాపరిరక్షతి'—అనియుఁ, 'పంచరాత్రము'న దుర్యోధనునిచే— 'మరణించినవారుమాత్రమే స్వర్గమును సముపార్జించికొనఁ గలుగుదురు'— అని పల్కుట అసత్యము; స్వర్గ మనునది దృశ్యము గాదు; కాని యది యిక్కడనే కలదు; అది యనేకవిధములగు ఫలములొసంగునది.' అనియు నుడువఁజేయును. 'దయా ధర్మ భిక్షావసరముననుు

సత్యమే నెలకొనవలసినస్థితి గలుగునేని, మానవులందుల కేమాత్రమును వెనుదివియక నిలువఁగలరు ?

దానములు యాగములు మున్నగువాని యావశ్యకతంగూర్చి భాసకవి నొక్కివక్కాణించును. 'ప్రఖ్యాతపురుషులు, మహారాజులు నగు—ఇక్ష్వాకువు, శర్యాతి, యయాతి, శ్రీరాముఁడు మొదలయిన వారు విగతశరీరు లయ్యుఁ, దమయజ్ఞయాగాది క్రతువులచే, నింకను జీవించియున్నవారే'— అని పాంచరాత్రమునను;—

"శిక్షాక్షయం గచ్ఛతి కాలపర్యయాత్
సుబద్ధమూలా నిపతన్తిపాదపాః
జలం జలస్థానగతం చ శుష్యతి
హుతం చ దత్తం చ తథైవ తిష్ఠతి."—

అని యీకర్ణభారమునను కర్ణునిచే భాసుఁ డనిపించును.

విధి బలీయ మనియు మానవప్రయత్నముల నది భంగపఱచు ననియు స్థిరనిశ్చయముగల భాసుఁ డన్నియు దైవఘటన లని సమ్మతింపక పోవుటకుఁ గారణము లేమో! అతని యభిప్రాయానుసారము సక్రమ ముగఁ బ్రారంభింపఁబడిన సదుద్యమములు సఫలము లగు నని, యౌగంధరాయణుని వాఙ్ముఖమున వచింపఁజేసిన యీక్రింది శ్లోకము వలనఁ దెలియుచున్నయది.

"కాష్ఠాదగ్ని ర్జాయతే మథ్యమానాత్
భూమిస్తోయం ఖన్యమానా దదాతి
సోత్సాహానాం నాస్త్యసాధ్యం నరాణాం
మార్గారబ్ధాః సర్వయత్నాః ఫలన్తి.

(ప్రతిజ్ఞా యౌగన్ధరాయణమ్.)

భా స మ హా క వి కృ తు లు

భాసుఁడు రచించిననాటకములు పదుమూఁడని యిదివఱకే చెప్పఁ బడినది. రామాయణములోని బాలకాండకథను దెలుపునాటకమొం డిటీ

వల వెలువడినది. అదియు భాసకృతియే యని పరిశోధకుల నిర్ణయము. భాసకవిప్రణీతనాటకము లింకను ఇరువదిమూఁడున్నట్లు పండితు లభిప్రాయపడుచున్నారు. ఇట్టిరూపకములే గాక, భాసకవివిరచితశ్లోకములు చెదురు చెదురుగాఁ బదుమూఁడు కానవచ్చుచున్నవఁట! వానిలో నైదు 'శార్ఙ్గధరపద్ధతి'లోను, నాలుగు 'సుభాషితావళి'లోను, మూఁడు 'సదుక్తి కర్ణామృతము'—లోను, ఒక్కటి 'సూక్తిముక్తావళి'—లోను గల వనుచున్నారు. కాని ఆశ్లోకములు ఇంతవఱకు వెలికివచ్చిన భాసనాటకములం దెందును గాన్పింపకున్నవి. అక్కారణముం బురస్కరించికొని 'భాసనాటకచక్ర' - గతదృశ్యకావ్యసమితి కర్తృత్వము సందేహాస్పదమని తీర్మానింపఁజాలము. ఏల యన, ఈశ్లోకములు గల భాసరచనము లింకను బయలువడలేదేమో !

భాసుని కవితావిశేషములు

భాసకవి మృదుమధురశయ్యలోఁ దా ననుకొన్న విషయములను సూటిగఁ జెప్పును. డొంకతిరుగు ళ్లుండవు. అతఁడు వివరించువర్ణనాంశములలో ననిర్వచనీయమగు రామణీయక మేదియో గోచరించుచు, రసికజనహృదయాహ్లాదకరముగ నివ్వటిల్లును. అతని హాసోక్తులు నిసర్గగంభీరభావసమన్వితము లయి, సహజసిద్ధము లగు చమత్కృతులతో భాసించును. అట్టి నర్మోక్తులనే జయదేవుఁడు కవితాదేవియొక్క దరహాస మని వర్ణించెను. భాసకృతులలోఁ బ్రకరణానుగుణములగు శ్రవ్యకావ్యధోరణులు సహితము గానవచ్చును. ఊరుభంగమున రణరంగముం దరియుచున్న వీరభటుల సంభాషణము లిందుల కుదాహరణములు.

కర్ణభారనాటకకథా వివరణము

'ప్రస్తావన'—అనఁబడు పూర్వరంగముతో నాటక మారంభమగును. 'దొమ్మికయ్య మంతకంతకుఁ దీవ్రరూపముఁ దాల్చుచున్న' దనియు, శీఘ్రముగ యుద్ధసన్నద్ధుఁడై పాలికలనికిఁ జేరవలసినవంతు తనపాలఁబడిన దనియు దుర్యోధనుఁడు చెప్పివచ్చుటకయి పంపినదూత

కర్ణునికడకుఁ బోవుచు రంగస్థలమునఁ బ్రవేశించును. కర్ణు నతఁడు గలసి కొనుసమయమున నా యోధుఁడు వ్యాకులీభూతచేతస్కుఁ డయి యుం టం గాంచి దూత విస్మయమందును. ఆవార్తాహారుఁడు కానీనునాకృతిం గని మేఘమండలాచ్ఛాదితుఁ డయ్యు, స్వభావసిద్ధ మగు తేజముతోఁ బ్రకాశించు భాస్కరసంకాశునిగ వర్ణించును.

శల్యసారథ్యముతో నడుపఁబడు రథమున యుద్ధావనిం జేరనరుగు నెడఁ దనకుఁ దటస్థించిన మనోవైకల్యమున కబ్బురమందుచుఁ, దా నభ్య సించిన యస్త్రవిద్యాదు లవసరమువచ్చినపుడు మఱచిపోవుటకును, బాండవులు చేఁజిక్కినపుడు వారిని జంపకుండుటకయి తల్లికోరిన వర మును బాలింపవలసివచ్చుటకును నెంతయుఁ జింతించును. అంతియగాక, తాను క్షత్రియుఁడ నని యసత్యము వచించి, యెట్లస్త్రవిద్యయుఁ, బ్రథన కళయు నేర్చెనో, యావిషయము నెఱింగిన గురుం డవి దగు సమయ మునఁ దోఁపకుండున ట్లెల శపించెనో యావృత్తాంతమును శల్యరాజు నకు సమగ్రముగ నివేదించును. సమరమున కరుగు కర్ణున కనేకదుశ్శకు నము లగును. తదస్త్రశస్త్రశక్తి నశించును. అశ్వములు సరిగా నడువక తొట్రుపడును. ఏనుఁగులు తడఁబడుచుఁ గదలమెదల కుండును. రణ భేరుల—శంఖముల దారుణధ్వనులు కర్ణకుహరములఁ బ్రవేశింపవు. ఇట్టిపరిస్థితు లున్నట్టుండి సంభవించుటకు మద్రభూపతి యచ్చెరువందును. అత్తఱిఁ గర్ణుఁ డతనిఁ జూచి "ప్రధనాంగణమున మరణించుచో వీర స్వర్గము లభించును;విజయమందుచో చిరతరఖ్యాతి చేకూరును. ప్రపంచ మున రెండును గోరఁదగినవే. ప్రతిపక్షులతో బవరమునఁ బోరు టొన్నఁ డును వ్యర్థము గానేరదు." అని చెప్పుటచేఁ దన్నుఁ దా నూరార్చి కొనును.

కొంత తడవునకుఁ గర్ణుఁడు తేఱుకొని యుత్సాహవంతుఁ డగును. కర్ణ శల్యు లిరువు రరదమునఁ గదనాంగణమునకుఁ జేర వచ్చుచుండ, ఒకానొక ద్విజునికంఠస్వరము వినవచ్చును.—"ఓకర్ణ! నిన్నొక మహాదానమున కయి యర్థించుచున్నాఁడను,"అని. రథాశ్వము

లాయెలుంగు విని ముం దడుగిడక యట్లే నిలిచిపోవును. ఇంద్రుఁడు బ్రాహ్మణవేషమునఁ గర్ణుని సమీపించి, "ఓకర్ణ! నినొక్క మహాదాన మున కయి యర్థించుచున్నాఁడను." అనును. కర్ణుఁ డాతనికి నమస్క రింపఁగనే,—"ఓయీ కర్ణ! సూర్యునివలెను, చంద్రునివలెను, హిమ వంతునివలెను, సముద్రునివలెను నీకీర్తి శాశ్వతమగుఁగాక"—అని దీవింపఁ గర్ణుఁ డాశ్చర్యమంది, 'చిరాయువుగ విలసిల్లుదు' వనుటకు మాఱు, అట్లాశీర్వదింపఁ గారణ మెఱుంగనేరక, 'రాజుల సంపదలు పాము నాల్కలవలె నస్థిరములు. కాన యగ్రజన్ముఁ డట్లు దీవించుట శుభప్రదమే; ఏల యన, దేహములు సద్యఃపాతములు; కాని, సుకృత ములు అచంచలములు.' అని తద్భావముగ గ్రహించి సంతృప్తినందును. అప్పు డతఁడు తనకు స్వాభావికమయిన యౌదార్యముం బురస్కరించి కొని, యాపాఱునకు వలయుచో, వేలకొలఁది యాలనేని, గజ ఘటల నేని, మిక్కుట మగు బంగారమునేని, (యుద్ధములలో గెలిచి) భూమండలమంతటినేని తానొనర్చిన యగ్నిష్టోమయాగఫలమునేని, తుట్ట తుదకుఁ దన మస్తకమునేని- ఇత్తు ననును. అట్టి వానితోఁ దన కెంత మాత్రము ఉపయోగము లేదని యాబ్రాహ్మణుఁడు వక్కాణింపఁగా, నతఁడు సురాసురులకేని భేదింపరానిదియు, మేనితోఁ గూడఁ బుట్టి నదియు నగు కవచమును గుండలసమేతముగ దత్తము చేయుదునని వాక్రుచ్చును. సంతసమున నాథరామరుంపు "అట్లే చేయుము, చేయు"—మని తీవరించును. వెంటనే సూతపుత్రుఁ డది శ్రీకృష్ణుని కపటోపాయముగ నూహించును. శల్యరాజు 'కవచకుండలము లీవ లదు'—అని కర్ణునికిఁ దెలుపును. కాని, దయాళువును, సహృదయుఁడు నగు కర్ణుఁడు:—'మద్రేశ్వరా! కాలముగడచుకొలఁది నేర్చిన విద్య నశించును. 'దృఢములగు మ్రాఁకులు గూకటివ్రేళ్లతో సహితము నేలఁ గూలును. కాని దానధర్మాదులు, యజ్ఞయాగాదులు మాత్రమే శాశ్వత ములుగ నిలుచును.' అని పలికి గవచకుండలములు దెగఁగోసి విప్రునకు సమర్పింప, నతఁడు వానిం దీసికొనిపోవును. అట్టియెడ శల్యరాజు కర్ణుం

గాంచి, 'నీవింద్రునిచే మోసగింపఁబడితివి' అని యనును.—'ఎంత మాత్రము గాదు; తాను గోరిన కోరిక నాచేఁ బొందెను కాన నతఁడే నాచే జయింపఁబడెను'- అని కర్ణుఁడు వచించును.

ఇంతలో ఒక దేవదూత కర్ణునొద్ద కరుదెంచి 'నీకవచకుండలములు హరించుటచే, దేవేంద్రుఁ డత్యంతపశ్చాత్తాపతప్తుఁడై 'విమలాఖ్య' మగు నీశక్తిని నీ కొసంగ నాజ్ఞాపించెను. ఇది యకుంఠితము; మహాదారుణము. దీని నెవనిపై ప్రయోగింతురో, వాని నొక్కనిమాత్రమే వధించి, మరల యథాస్థానమునకుఁ జేరఁగలదు.' అని నుడివి, దాని నంగరాజున కీవచ్చును. అట్టియెడఁ గర్ణుఁడు, 'తా నొసంగిన దానమునకు బదులుగ నొండొకవస్తువుం బరిగ్రహింప' నని వాకొన,-దేవదూత-'ఇది బ్రాహ్మణవచనము; కానఁ దప్పక స్వీకరింపఁదగిన' దనఁ గర్ణుఁడందుల కంగీకరించి చేకొనును. దూతయు నిష్క్రమించును. కదనభూమి నుండి యింతలో శంఖధ్వని వినరా, కర్ణుఁ డట కురుకును.

గ్రంథనామౌచిత్యము

గురువగు పరశురామునివలనఁ దా నేర్చిన శస్త్రాస్త్రవిద్యలు అతనిశాపముచేతనే నిస్సారములు, నిష్ప్రయోజనములు, నిరర్థకములు నయ్యెను. 'అర్జునునిఁ దక్కఁ దక్కిన పాండవులలో నెవఁడు దనచేఁ జిక్కినను వాని రక్షింతు' నని కర్ణుఁ డంబ కిచ్చిన వరముగూడ నందులకుఁ దోడయ్యెను. దేవతలచేతఁగాని, రాక్షసులచేతఁగాని భేదించుటకు వీలుగానిదియు, ఆజన్మసిద్ధముగ విలసిల్లునదియు నగు సహజకవచకుండలములను బిడౌజున కర్పించెను. కాన, గురు విడిన అస్త్రవిద్య, అమ్మకుఁ దా నిచ్చిన వరము, కవచకుండలరాహిత్యము-ఇవన్నియు నిర్వీర్యములగుట మహాయోధుఁ డగు కర్ణుఁడు నిస్సత్త్వుఁడయి, కేవలము వానికి భారవాహకుఁడుగ మాత్రమే పరిణమించి ప్రాణములు వీడెను. ఆకారణముననే గురుశాప, కుంతీవర, కవచకుండలరాహిత్యములు అతనికి ఏమాత్రము ఉపకరింపకపోవుటను గమనించియే భాసకవి ఈ నాటకమును 'కర్ణభార' మని పేర్కొనుట యెంతయు సమంజసమే యగును.

కథానాయకుఁ డగు కర్ణుని గుణశీలాదికములు

కర్ణుఁ డంగదేశప్రభువు; సహజౌదార్యసంపన్నుఁడు; స్వాభావికముగ మహాదాత; యోధాగ్రేసరుఁడు; ఆయోధనప్రియుఁడు; తేజోనిధి; పోరాట మన నతనికి మనుగుడుపువంటిది. అట్టియెడ గమ్యముం గూర్చి యాతని కిసుమంతయు జంకు గొంకులు లేవు. కాని, 'కర్ణ భారశోకపర్యవసానముం' గూర్చియే యాతఁడు సుదీర్ఘముగ నాలోచించుచుండెను. పసితనమునఁ గన్నతల్లిచేతను, ప్రియశిష్యుఁడుగ నున్నతఱి గురువుచేతను, మహావీరుఁడుగఁ బోరిలో మెలఁగు సమయమున నింద్రునిచేతను బ్రతారింపఁబడియె. ఆ విషయ మెఱింగియుఁ, దెలిసి తెలిసి మృత్యుదేవతను జేసేత వరించి, యాహ్వానించి కొనితెచ్చి కొన్నట్లయినది. అట్టియెడఁ గర్ణుఁ డుత్సాహముం గోల్పోవ లేదు; ఉత్సాహమును వదలలేదు. కర్ణుఁ డట్టిచోఁ జెప్పిన మాటలను వినుఁడు:—
"ప్రధనాంగణమున మరణము తటస్థించునెడ వీరస్వర్గము లభించును; విజయమందునెడఁ జిరతరఖ్యాతి చేకూరును. ప్రపంచమున ఈ రెండును వీరులు గోరఁదగినవే."—దానధర్మాదులు, యజ్ఞయాగాదులు మాత్రమే శాశ్వతములయిన వని కర్ణుని యాశయము. తదన్యములు అనఁగా, శాస్త్రాభ్యాసములు మున్నగునవి కాలముతోఁబాటు నంతరించున వని 'ఇంద్రుఁడే నాచే మోసగింపఁబడియె. నేను గాను' అని కానీనుఁడు వక్కాణించును. ఇవి కర్ణుని వ్యక్తిత్వమునకును లోకానుభవములకును సముచితతార్కాణములు.

భాసకాళిదాసులు

భాసునిరూపకములలో ననేకోత్కృష్టగుణములు గల వనుట నిర్వివాదాంశము. కాని, యవి కాళిదాస నాటకములలోని వానికంటె నతిశయించినవి కావు. అందులకు హేతువులు దృశ్యకావ్యసాహిత్యములోని ధోరణులు, మెలపులు మున్నగు వాని పోకడ లిందుఁ గాన్పింపవు. ఆయాకవుల చిత్తవృత్తుల ననుసరించి, నూత్నభావములు వెల్లు

బుకు కొలఁది యట్టివి సహజసిద్ధములు. కాళిదాస భవభూతులకు రసజిజ్ఞాసప్రధానము. తక్కిన లక్షణము లేవియైన, నవి దాని తరువాతనే. ఈసందర్భమున గీర్వాణనాటకకర్తలందఱు ఒకే త్రాటిమీఁద నడచినవారు గావచ్చును; కాని కాలానుసారము వ్యక్తిగతములుగ వెవ్వేఱభిప్రాయములు గలవారు గావచ్చును. రసావిష్కరణమున మాత్రమే వా రేకీభవింతురు. రూపకములలోని తక్కిన లక్షణాంశములకంటె రసోల్బణమే ఎక్కుడుగఁ జూపట్టును. అట్టి కర్తల కందఱకు భాసమహాకవి పూర్తిగ వ్యతిరిక్తుఁడు. రసైక్యతకు దోహదమిచ్చుటకంటెఁ బాత్రపోషణ కథా సంవిధానాదులందు భాసునకు భాసుఁడే తుల్యుఁడు. భాసుని షేక్స్పియరు మున్నగు పాశ్చాత్యనాటక కర్తలతోఁ బోల్చి చూతుమేని, వారందఱకంటె మెఱుఁగ గనిపించును. అతఁడు వెనుకటి కవుల రూపకమున కొరవడి దిద్దిన మహాకవి.

నాటకసూక్తులు

1. గో బ్రాహ్మణుల కక్షయమగుఁగాక ! పతివ్రతలకు స్వస్తియగుఁగాక ! రణపరాఙ్ముఖులుగాని యోధులకు దిగ్విజయ మగుఁగాక ! కాలము తటస్థించిన నాకును శుభమగుఁ గాక ! (కర్ణుఁడు)
2. క్రమముగ లభించె నీపుణ్యకాల మిదియ కడు సదృష్టదినం బగు. (కర్ణుఁడు)
3. పరశురామునకు క్షత్రియవంశముమీఁద సహజసిద్ధముగఁ బూర్వ మునుండియే వైరము గలదు గదా ! (శల్యుఁడు)
4. అకటా ! ఎంతటి ఘోరమయిన శాపము ! (శల్యుఁడు)
5. తోడ్పడ దీశరరాజిఁగోరు నత్తరుణమునందు నీకు.(పరశురాముఁడు)
6. దేవా ! నీ వేల దీర్ఘాయు వన లేదు ? అదియే గదా శ్రేయస్కర మయినది. (కర్ణుఁడు)
7. నే నిప్పు డే మని వచింతును ? దీర్ఘాయుర స్తన్న చో, దీర్ఘాయువు ప్రాప్తించును. (ఇంద్రుఁడు)
8. ఇచ్చిన దానికి బదులుగ నేను మఱొక్క దానిఁ జేకొనను. (కర్ణుఁడు)
9. పాము నాల్కలవంటివి ప్రభులసిరులు కాన నృపతులు యత్నించి యేని, నిలుపవలయు ధర్మము. (కర్ణుఁడు)
10. ఛీ ! ఛీ !, కృష్ణుని కపటోపాయములలో, నిదియు నొకటి యగుఁ గాక ! దీనింగూర్చి యింత దీర్ఘముగ నాలోచించుచుఁ గూరుచుం డుట తగదు. (కర్ణుఁడు)
11. భూమండలముతో నా కేమి పని ? (ఇంద్రుఁడు)
12. బ్రాహ్మణవచనము ననుసరించి యనుచున్నావా ? ఇంతవఱకు విప్ర వాక్యము నుల్లంఘించినవాఁడఁ గాను. (కర్ణుఁడు)

13. పాకరిపుఁడె నిజంబుగ వంచితుఁడు. (కర్ణుఁడు)

14. నేఁ గృతార్థులలోఁ గణనీయుఁ డైతి. (కర్ణుఁడు)

15. అట్లు వచింపనిచో లోకము నన్ను మూర్ఖుఁడని పరిభవించును. (ఇంద్రుఁడు)

16. అంగరాజా! మోసగింపఁబడితివి గదా! (శల్యుఁడు)

17. నాచే నింద్రుఁడే మోసగింపఁబడెను. (కర్ణుఁడు)

18. ఏను పయఃపాన మరుదుగఁ జేయుదును. (ఇంద్రుఁడు)

19. కాలమేఁగెడు కొలఁది శిఖయు శుష్కించు,
ప్రేళ్ళబిగిఁ గల మ్రాఁకులు పృథివిఁగూలు,
బహుజలాధారములుగూడ వట్టిపోవు,
హుతము దత్తము నిల్చు శాశ్వతము గాఁగ. (కర్ణుఁడు)

20. మేను లూఁడుఁగాని గుణమ్ములు వీడ వెపుడు. (కర్ణుఁడు)

21. లయమందిన దివి గలుగున్
జయమందిన యశము గలుగు; జగమున రెండున్
బ్రియమునఁ గోరుదు, రే లనః?
బుయిలోటమి లేని ఫలమె పొనుపడ దెపుడున్. (కర్ణుఁడు)

కుంతీదేవి కర్ణునిచేఁ బొందిన వరము

ఈ 'కర్ణభారము'న శల్యునకుఁ గర్ణుఁడు తనకు సంభవించిన గురుశాపమును వివరించెనే కాని, మాతృవరముం గూర్చి యట్లొనర్ప జంకి, కేవలము సూచనప్రాయముగఁ జూపి వదలెను. అట్లు చేయునెడఁ దన జననిస్వార్థమును, దన యజ్ఞతయు వెల్లడించిన ట్లగునేమో యని యతని యాశయ మయియుండవచ్చును. కాన ఆ వరదానముంగూర్చిన కత నిటఁ దడవుట అప్రస్తుతము గాదు:—

(అది యీ క్రింద శ్రీమదాంధ్రమహాభారతమునుండి సముద్ధృతము.)

"కొండొకసేపునకు జపంబుదీఱె, (కర్ణుండు) కలయం గనుంగొని, యమ్మహాదేవిం (కుంతీదేవిని) గాంచి, కానీనుండు సంభ్రమవినయంబులతోడం జేరి, సూతగోత్రంబును రాధేయనామంబును జెప్పి, యభివాదనంబు సేసి—'నీవు విజయంచేసిన కార్యం బేమి? నాకుం జేయంగల పని యెయ్యది? యానతి' మ్మనినఁ గుంతీదేవి యేకాంతంబుగా నిట్లనియె:—

సీ. వినుము సూతాన్వయంబున నీవు పుట్టుట
        బొం, కేను మాకుంతి భోజునింటఁ
    గన్నియనాఁడు భాస్కరుని రావించితి
        వరమంత్రబలమున వచ్చి యతఁడు,
    సంప్రీతి నొసఁగంగ జన్మించినాఁడవు
        నాకుఁ, గావునఁ బాండునందనుండ,
    వగుదు ధర్మస్థితి నట్టి నీ వితరులఁ
        గొలువ నేటికిఁ గురుకులవరేణ్య?
    ధర్మతనయాదులైన నీ తమ్ములకును
    ధార్తరాష్ట్రులకును నీవ తగు విభుండ

వేలు నీలోకమెల్ల; నీ కేల రాధ
కొడుకితం డను తక్కువ కొడుకుఁగుఱ్ఱి?

క. అని పలికిన యవసరమున
నినబింబములోన నుండి 'యిది నిజ, మిబ్భం
గిన నెగడవన్న మేలగు!'
నను వాక్యము వెడలెఁ గర్ణుఁ డాకర్ణింపన్.

తే. దాని వినియును నపుడు రాధాసుతుండు
దిరుగఁబడని మనంబుతో ధీరవృత్తిఁ,
దల్లి కిట్లను: 'నీమాట తథ్యమగున,
యైన నొక్కటి సెప్పెద, నవధరింపు.'

క. 'క్షత్రియ సంస్కారమునకుఁ
బాత్రముగా నీవు నన్నుఁ బాటింప, విహా
ముత్ర ఫలములకు నీ కేఁ
బుత్త్రుఁడ నని వచ్చు టెంకఁ బొసగునె? చెప్పుమా!

వ. సూర్యానుగ్రహంబునంజేసి నిందంబు గాక తక్కెనేనియు, నా జన్మంబు పరమరహస్యంబునై యున్నయది. దీనిఁ బ్రకాశంబుసేయుట మన కెంతమే? లట్లుం గాక;

ఆ. విజయు విక్రమంబు విఖ్యాత మై యుండ
నేను గుంతికొడుక భానుజుండ
ననుచు నతనిఁ జేర నరిగిన నతనికి
వెలిచి పోయె ననరె? వేయు నేల

క. కడిఁది పగఱ నేఁ దెప్పగఁ
గడవంగా నీఁదఁ దలఁచు కౌరవనాథుఁ
జెడుఁగాక యంచు నిత్తఱి
విడవఁదగునె? యతనివలన వెలసిన వాఁడన్.

క. కౌరవులచేతఁ గుడిచిన
వారికి నిది సమయమెట్టివారును సంగ్రా
మారంభంబునఁ బాయుదు
రే? రాజులు మనలఁ దిట్టరే య ట్లయినన్.

వ. ఏ నవశ్యంబును నీ కొడుకుతోడం బెనంగుదు.

ఉ. నీపలు కెంత వోలినను నిర్ణయ మిట్టిద కాని యొండు లే
దీ పనిమీఁది భారమున నీ విట వచ్చితి గానఁ బాండవుల్
నేపడిరేనిఁ జంప, నలుసేయక చెప్పెద, సవ్యసాచిపైఁ
గోపము పెద్ద, వాఁడు సమకూరిన బిట్టలుఁ జంపుదుంజుమీ.

ఆ. సవ్యసాచిచేతఁ జచ్చుటయును గీర్తి
కరమ యతఁడు లోనుగాఁగ నేవు,
రేను లోనుగాఁగ నేవురు; గాని, నీ
కొడుకు లార్వు రనుట విడువు మింక.

చ. అనుటయు నప్డు గొంతి హృదయంబున శోకము నివ్వటిల్ల, ని
ట్లను, నిది దైవసంఘటన, మక్కట! యెట్లును దప్ప నేర్చునే?
యనుపమసత్యవిస్ఫురణ, నాడినమాట మఱాకుమన్న, నీ
యనుజుల నల్వురం గడపు మర్జునుచేతకు సమ్మతించితిన్.

తే. అనుచుఁ గౌఁగిలింప నర్కజుం డట్ల కా
కని ప్రియంబు మెఱయ వినతుఁ డైన
నరిగె సదనమునకు, నద్దేవి; యతఁడును
జనియె నిజనివాసమునకుఁ బ్రీతి.

విన్నపము

'ఆంధ్రమహిళా' పత్రికా కార్యాలయమునం దుద్యోగమునుండి విరమించిన తరువాత, నా సారస్వతపరివస్య కింత యవకాశము లభించుటయే తడవుగ, భాసనాటకచక్రమునందలి కర్ణుని యౌదార్యముం దెలుపు—ఈ 'కర్ణభారము' నాంధ్రీకరింప మనసు మరలినది. వెంటనే పూనా 'ఓరియంటల్ బుక్సు ఏజన్సీ'వారి భాసనాటకచక్రమును, మైసూరు 'సంస్కృతసాహిత్యసదనము' వారి కర్ణభార (ప్రత్యేక కర్ణభారప్రచురణ)మును ఆధారములుగఁ జేసికొని, విపుల పీఠికా సహితముగ మూఁడు దినములలోఁ దెనిఁగించితిని. కాని, యిది కేవలము 'తు' - 'చ' తప్పని తెలిఁగింపని మనస్ఫూర్తిగఁ జెప్ప సాహసింపను. అట్లని బుద్ధిపూర్వకముగ మూలాతిక్రమణమునకుఁ బూనుకొన్నవాఁడను గాను.

భాసనాటకములను బెక్కింటి నిదివఱకే కొందఱు విద్వత్కవీంద్రు లనువదించిరి. అందుఁ జాలమంది యీ నాటకచక్రాంతర్గతములగు పెద్దవనఁదగిన అభిషేకము, ప్రతిమ, పాంచరాత్రము, ప్రతిజ్ఞాయౌగంధరాయణము మున్నగువాని వంకకే తమదృష్టులం బఱపిరి. నేను మొదట 'ఊరుభంగము' ననువదించితి. అయ్యది మదరాసు విశ్వవిద్యాలయమువారు మూఁడేండ్ల పట్టపరీక్షలకుఁ బాఠ్యముగఁ గూడ నిర్ణయించిరి. ఇది రెండవది. విద్యాశాఖాధికారులు, రసజ్ఞులు, భాషాభిమానులు నిద్దాని నాదరించుటలోనే తక్కిన నాటకములను గూడ నాంధ్రీకరింపఁ గుతూహలి నగు నాకుఁ బ్రోత్సాహము నొసంగినవా రగుదు రని వినతిమై విన్నవించుకొనుచున్నాఁడను.

గ్రంథకర్త.

ఇందలిపాత్రలు

కర్ణుఁడు:—అంగదేశాధినాథుఁడు, కౌరవసైన్యాధిపతి.

శల్యుఁడు:—మద్రేశుఁడు, కర్ణునిరథసారథి.

భటుఁడు:—కౌరవపక్షమందలి వార్తావహుఁడు.

ఇంద్రుఁడు:—బ్రాహ్మణవేషమున వచ్చిన స్వర్గాధిపుఁడు.

దేవదూత:—ఇంద్రునివార్తావహుఁడు.

స్థలము:—కురుక్షేత్రమందలి రణరంగము.

శ్రీః

కర్ణభారము

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును)

సూత్ర:—

ఆలోకించినమాత్ర, మానవమనుష్యస్త్రీసుపర్వాసురా
భీలాహవల్ భ్రమియింప దుర్దనుజరాడ్విస్తీర్ణవక్షఃస్థలీ
ప్రీలంజేసి సురారిసేనల నడంచెఁ లీల నెవ్వాఁడతం
డోలిన్నానవసింహరూపుఁ డిడుమిా కుత్కృష్టసౌభాగ్యముల్.

ఆర్య మిశ్రుల కిదే విన్నపము—(పరిక్రమించి చెవియొగ్గి) ఏమిది ? నే నీరీతి నుడువ నుంకింపఁగనే యేదియో సవ్వడి వినవచ్చుచున్నది. కనుఁగొందునుగాక !

(నేపథ్యమున) ఆర్యా ! మహారాజగు అంగేశ్వరునకు ఇట్లు నివేదింపుము.

సూత్ర:—ఆహా ! ఇపుడు తెలిసినది.

క. తుములాహవ మెసఁగ, నరో
త్తముఁడు సుయోధనుఁడు కర్ణుదండ కరిగి, హ
స్తములు మొగిచి యిట్లను మన
నమితత్వర భటుఁడు వచ్చె నను మాతనితోన్.

(నిష్క్రమించును)

(ఇది ప్రస్తావన)

(అంత భటుఁడు ప్రవేశించును)

భట:—ఆర్యా ! యుద్ధకాల మాసన్నమయిన దని మహారాజగు అంగేశ్వరునకు విన్నవింపుము.

తే. కరి తురగ రథస్థులై కడుముదమున
నవనినాథకేసరులు పాండవుల యెదుర
నిడెడు పెడబొబ్బలను విని, వెడలు నిదిగొ!
భుజగకేతుఁడు వేవేగఁ బోలికలనికి.

(పరిక్రమించి, చూచి) ఓహో! సంగ్రామమునకు సంసిద్ధమయిన పరిజనము తన్నుఁ బరివేష్టింప, అంగదేశాధినాథుఁడే శల్యరాజుతోఁ గూడఁ దనభవనమునుండి వెడలి, యిట్లే వచ్చుచున్నాఁడు. కాని, కయ్యము లన్నఁ బందువు లట్లు భావించుచు, సేనలకు ముందు నిలుచువాఁడును, జూపలు లచ్చేఁ గడుంగడు పరాక్రమవంతుఁడని ప్రఖ్యాతినొందిన వాఁడును అగు నీతఁడేదియో హృదయావేదనమున కగ్గమయినట్లు కన్పట్టుచున్నాఁడు.

తే. సమరమున నగ్రగణ్యుఁడు సవితృతేజుఁ
డతివివేకి కర్ణుండిపు డార్తిఁ జెంది,
గ్రీష్మమున నంబుదము లడ్డగింప, నినుఁడు
సహజరుచులనె వెలుఁగొందు సరణి నెగడె.

ప్రకృత మింకేను విరమింతును.

(భటుఁడు నిష్క్రమించును)

(కర్ణ శల్యులు సముచితవేషములతోఁ బ్రవేశింతురు)

కర్ణ:— తే. నాశరములకు గుఱిగాని నరపతు, లనిఁ
బ్రాణశేషులై యరుగుమాత్రమునఁ గలదె
ఫలము? పార్థుఁడు నాకంటఁ బడినయపుడు
కురుకుమారులకుం దృప్తిఁ గూర్తు, నిజము.

శల్యరాజ! అర్జునుఁడుండు దెసకు మనయరదముం బోనిమ్ము.

శల్య:—మంచిది. అట్లే యొనర్తును.

కర్ణ:—ఔరా! ఆశ్చర్య మాశ్చర్యము!

తే. ఒండొరుల ఖడ్గహతిఁ గండతుండెములయి
కూలు భటగజాశ్వరథావయవా లెసంగు
పోరులం గ్రుద్ధుఁ డగు యమువోలె మీఱి
శౌర్యముం జూపు నాకును సమరవేళ
మానసము వ్యాకులమున కఠినమయ్యె.

అకటా!

క. తొలి కుంతికే పుట్టితి, న
వ్వలరాధేయుఁ డని ఖ్యాతి వడసితి, నంతే,
తెలియుదు ధర్మజుఁ డాదిగఁ
జెలఁగెడు పాండవులు నాకుఁ జిన్న లటంచున్.

తే. క్రమముగ లభించె నీపుణ్యకాల, మిదియ
కడు నదృష్టదినం బగుఁ, గాని యేను
నభ్యసించిన శస్త్రవిద్యలు సమస్త,
మంబమాటను విఫలంబు లయ్యె నిపుడు.

ఆర్యా! శల్యరాజా! నాయస్త్రవిద్యాసముపార్జన మించుక ఆలింతువుగాక!

శల్య:—నాకును అది తెలిసికొనవలె నను కుతూహలము గలదు.

కర్ణ:—పూర్వ మొకప్పుడు నేను జామదగ్నిం దర్శింప నేఁగితి.

శల్య:—అంతట?

కర్ణ:—అట్టియెడ.

శా. తుంగంబై, కపిలంబునై, మెఱయు వి
ద్యుద్వల్లిశోభంబునై
బంగారువన్నె సెసంగు సుందర జటా
భారమ్ముతో వెల్గుచున్

శృంగారప్రభ చుట్టువాఱు పరశుం
జేదాల్చి యొప్పారుచుః
బొంగారం గల భార్గవు న్నతులచేః
బూజించి నే నిల్వఁగన్.

శల్య:—తరువాత, తరువాత ?

కర్ణ:—మహర్షిపుంగవుం డగు నాపరశురాముఁడు నన్ను దీవించి, 'నీ వెవ్వఁడవు ? ఇక్కడ కేల వచ్చితివి?'—అని ప్రశ్నించెను.

శల్య:—అనంతరము ? అందులకు నీప్రత్యుత్తర మేమి ?

కర్ణ:—అనంతరము 'గురుదేవా! ఏను మీకడ సమస్తాస్త్రశస్త్రవిద్యా శిక్షణ మొంద నరుదెంచితి'—నంటిని.

శల్య:—ఆవల ?

కర్ణ:—ఆవల భగవానుఁ డాభార్గవుఁడు 'నేను బ్రాహ్మణులకు మాత్ర మీవిద్య నుపదేశింతును. కాని, క్షత్రియులకుఁ గాదు'-అని వచించెను.

శల్య:—నిజమే, పరశురామునకు క్షత్రియవంశముమీఁద సహజసిద్ధముగఁ బూర్వమునుండియే వైరము గలదుగదా!

కర్ణ:—అపు డేను క్షత్రియుఁడఁ గా నని నుడివి యస్త్రవిద్యాభ్యాసము నకుఁ గడంగితిని.

శల్య:—ఆవెనుక జరిగిన దేమి ?

కర్ణ:—కొంతకాల మట్లు గడువ, నొకానొకప్పుడు ఫలములు, కందమూలములు, సమిధలు, దర్భలు, పుష్పములు మున్నగునవి గొనితేర, నరణ్యమున కరుగుచున్న గురువరేణ్యునితోఁ గూడ నేను నరిగితిని.

శల్య:—పిదప ?

కర్ణ:—గహనాంగణమునఁ ద్రిమ్మరుటంజేసి, బడలిన మునివరుఁడు నా యొడిం దలగడగఁ జేసికొని యొక్కెడఁ బరుండి గాఢముగ నిద్రింపఁ దొడఁగెను.

శల్య:—పాప మావృద్ధుఁ డత్యంత మలసియుండెఁ గాఁబోలు! పిమ్మట?

కర్ణ:—చ. భరమగు బాధ సైచితిని, వజ్రముఖక్రిమియూరుఁదొల్వ మ
ద్గురునకు నిద్రభంగమనితోఁచి, యతండును మేలుకాంచి, నె
త్తురు గని క్రోధమూర్తియయి 'తోడ్పడ దీశరరాజిగోరు న
త్తరుణమునందు నీ క'నుచు దారుణశాపమొసంగె నక్కటా!

శల్య:—అకటా! యెంతటి ఘోరమగు శాపము!

కర్ణ:—మన మిపు డీయస్త్రవిషయ మొక్కింత పరిశీలింతము. (అట్లొనర్చి) ఈయస్త్రము లిపుడు శక్తిసంపన్నములు గావు. మఱియు—

తే. ఈ హరుల్ మూయు దీనత నీక్షణములఁ
దడఁబడుచు వివశత్వాన నిడె నడుగులఁ
గరులు సప్తచ్ఛదాభ సుగంధదాన
ములు స్రవింప ననిం గూర్చి తెలుప వచ్చె!

శంఖ దుందుభి ధ్వనులును వినంబడకున్నయవి.

శల్య:—అకటా! కష్టము కష్టము. ఇట్టిస్థితి యేల సంభవించెనో కదా!

కర్ణ:—శల్యరాజా! వగవకుము.

క. లయమందెన దివి గలుగుఁ
జయమందిన యశము గల్గు; జగమున రెండుఁ
బ్రియమునఁ గోరుదు, రేలన
బయిలోటమి లేనిఫలమె పొసఁగనియెడలన్.

ఇంకను—

తే. ఆహవమ్మునఁ గల తృష్ణ యాఁజనివియు,
వైనతేయాభ వేగము లైనయవియు,
మంచి కాంభోజజాతి జన్మించినవియుఁ
గాచునవి యీహరుల్ వీనిఁ గావవలదె?

గోబ్రాహ్మణుల కక్షయమగుఁ గాక! పతివ్రతలకు స్వస్తి యగుఁగాక! రణపరాఙ్ముఖులుగాని యోధులకు దిగ్విజయ మగుఁగాక! కాలము తటస్థించిన నాకును శుభమగుఁగాక! ప్రకృత మే నిట నత్యంతోత్సాహపూరితుఁడను:

తే. ఓర్వరానిపాండవ ప్రధనోర్విఁ జొచ్చి,
ప్రథిత గుణగణు ధర్మజుఁ బట్టి కట్టి,
నాదు శరజాల వేగాన నరునిఁ గూల్చి,
హతమృగేంద్రవనం బటులందుఁ జొత్తు.

శల్యరాజ! ఇఁక రథ మారోహింతము.

శల్య:—అట్లే, కానిమ్ము (ఇరువురును తేరి నెక్కుట నభినయింతురు.)

కర్ణ:—శల్యరాజ! మన రథ మర్జునుఁ డున్న దిక్కునకుఁ బోవనిమ్ము.

(నేపథ్యమున) ఓయీ! కర్ణ! నిన్నొక మహత్తరమగు భిక్షకై యాచించుచున్నాఁడ.

కర్ణ:—ఇప్పలుకు లెవరివో యొక మహావీరునివి గానోపును.

ఉ. ఈతఁడు కేవలం బొక ద్వి
జేంద్రుఁ డనం జను నొక్కొ? ప్రాభవో
పేతుఁడు; తన్మధూకమగ
భీరరవంబును విన్న యీ హరుల్

బ్రాతిగ నిశ్చలేక్షణము
లం దిలకించుచు, నీకు వీనులర్ల
మూఁతులు వక్రమౌ మెడల
పొంతకుఁ జేరఁగ నిల్చెఁ జూచితే.

శల్యరాజా! ఈ వారువములు చిత్రార్పితరూపము లట్లు కాన్పించెడు. అమ్మహాభాగుఁ డెవ్వఁడై యుండునో? తిర్య క్కులు గూడ నాతనిం గని, తమ మేనుల వశములుగా నిలఁ బడినవిగదా! — ఆర్యా! అవ్విప్రోత్తముం దో డ్తెమ్ము... వలదు, వలదు. నేనే స్వయముగ వెడలి యాతనికి స్వాగత మొసంగుదును. (అంత బ్రాహ్మణరూపముతో నింద్రుఁడు ప్రవేశించును).

ఆర్యా! ఇటు, ఇటు.

ఇంద్ర:— ఓ మేఘములార! సూర్యునితోఁ గూడ మీరును దరలి పొండు. (కర్ణుని సమీపించి) ఓయీ! కర్ణ! ని న్నొక మహా త్తరమగు భిక్షకయి యాచించుచున్నాఁడ.

కర్ణ:— ఆర్యా! మివుల సంతుష్టుఁడను.

తే. నేఁ గృతార్థులలో గణనీయుఁడఁ గద
క్షితిపవరమౌళిరత్నరంజితపదాంబు
జాతుఁడు ద్విజేంద్రచరణరజము శిరమునఁ
బూని పావనుఁడైన కానీనుఁ డిదిగొ!

ఇంద్ర:— బాగు బాగు! నే నిపు డీతని నేమని దీవింతును? 'దీర్ఘాయుర' స్తన్నచో నితనికిఁ దప్పక దీర్ఘాయువు ప్రాప్తించును. అట్లు వచింపకున్నచో, లోకము నన్ను మూఢుఁ డని పరిభవించును. కావున ఈ రెండుమార్గముల నుజ్జగించి ప్రకృత మే మని దీవింతును?— అస్తు! చూచెదఁగాక! (ప్రకాశముగ) ఓయీ! అంగభూపతీ! సూర్యు నట్లు,

చంద్రునివలె, హిమవంతుని తెఱంగున, సముద్రునోజ నీయశ
మీలోకమున శాశ్వతముగ నిలుచుఁగాక !

కర్ణ:—(చకితుఁడై) దేవా ! నీవేల 'దీర్ఘాయు' వనలేదు ? అదియే గదా
మిగుల శ్రేయస్కరమయినది. ఏల యన:—

తే. పామునాల్కలవంటివి ప్రభులసిరులు
కాన, నృపతులు యత్నించియేని, నిలుప
వలయు ధర్మము, ప్రజ నేలుపట్ల, మేను
లూఁడుఁగాని గుణమ్ములు వీడ వెపుడు.

ఆర్యమహాశయా ! మీ కేమి కావలయును ? నే నేమి
ఈవలయు ?

ఇంద్రు:—నాకుఁ గావలసిన దొక మహత్తరమగు భిక్ష. అందులకే
నిన్నిపుడు నేను యాచించుచున్నాఁడ.

కర్ణ:—సరియే. అదెంతటి మహత్తరమగు భిక్ష యైన నిచ్చుటకు సర్వదా
సంసిద్ధుఁడను. నాసంపద్వైభవములు నివేదింతును. ఆలింపుఁడు.

తే. ద్విజవరా ! తరుణములుఁ, బవిత్రములును
నర్థులకు నెప్డుఁ బ్రార్థనీయములుఁ, బైఁడి
కొమ్ములం గలవి తఱపులఁ గూడినవియు
నమృతమట్టి పాలిడు వేయియాల నిత్తు.

ఇంద్ర:—గోసహస్రమా ? ఏను పయఃపాన మరుదుగఁ జేయుదు. వలదు
కర్ణా! వలదా యావులు.

కర్ణ:—వలదా ? అయిన నిదిగో, వినుఁడు.

తే. రవి తురంగమ సమములు, రాజ్యరమకు
సాధనాల్, తేండ్లకెల్లఁ బూజ్యములు, సుగుణ
వంతములును గాంభోజభవమ్ము, లాజి
చణములై యొప్పు వేయి యశ్వముల నిత్తు.

ఇంద్ర:—అశ్వములా? నే నెప్పుడోగాని గుఱ్ఱపుస్వారి చేయువాఁడఁ గాను. అవి నాకేలనయ్యా? రాధేయా! ఒల్లను.

కర్ణ:—మహాశయా! గుఱ్ఱము లొల్లవేని నొండొక్కటి సూచింతు. వానిఁ గోరికొనుము. వేని నందువా?

తే. గండములఁ గాఱు మదవారికతన మూఁగు
నళులతో గిరిసమితినా నలరు చుఱుము
ననువునం గీఁకలిడుచుఁ దెల్లని నఖదంత
ము లెసఁగఁ బగఱ నొంచు నేన్గుల నొసఁగుదు.

ఇంద్ర:—అయ్యో! యేనుఁగులందువా? నా కవి యేలనోయి! కరుల పయి నెక్కుటకే నాకుఁ జేతగాదే; సూతసుతా! వలదా గజఘటలు.

కర్ణ:—ఏమాశ్చర్యము? అయిన విను మింకొక్కటి. అపరిమిత హేమ రాసులు నాకుఁ గలవు. వాని నిచ్చెద. స్వీకరింపు మార్యా!

ఇంద్ర:—సరియే, యేదో యొకటి. అట్లే యిమ్ము. (స్వీకరించి) ఇక నేఁ బోయివత్తును. (కొన్నియడుగు లరిగి తిరిగివచ్చి) ఈబంగారము నాకు వలదు. నీవే కైకొనుము (అని యర్పించును.)

కర్ణ:—అయిన నీ భూమండలమెల్ల గెలిచి నీకు దానముగ నర్పింతును.

ఇంద్ర:—ఔరా! భూమండలము పరిపాలింప శక్తిగల క్షత్రియునకుఁ దగును. కాని, నా కేల? అంతటి పరిశ్రమకుఁ బూనుకొనకుము.

కర్ణ:—ఐన నే నొనర్చిన యగ్నిష్టోమయాగఫల మొసంగెద.

ఇంద్ర:—దాన నా కేమి మేలు?

కర్ణ:—సరియే. నా మస్తక మర్పింతునా?

ఇంద్ర:—మానుము మానుము. అట్లొనర్చుట యుక్తముగాదు.

2

కర్ణ:—భీతిల్లకుము. ఈకర్ణుఁడిదివఱ కెప్పుడు నర్థిజనాభ్యర్థనము వ్యర్థ మొనర్చినవాఁడుగాఁడు. ఇపుడుఁగూడ నట్లొనర్పఁడు. ఆహా! స్మృతికివచ్చినది. మఱియొక్కటి నీ కీఁగలను. అను గ్రహింపుము. అది నా కత్యంత ప్రేమపాత్రమయిన భూష ణమే యగుఁగాక! వలయునేని వెనుదీయక నీ కిడి సంతుష్టి నొందింపఁగలను. పరిగ్రహింపుము. అదేది యని యందువా? వినుము.

తే. నాదు మేని రక్షింప నంగములతోడఁ
గలిగి, యమరాసురులకేని దలఁగరాని
కవచకుండలములఁ గోనఁ గాంక్షయేని
ప్రీతితో నిత్తు, నిదె నీకు విప్రవర్య!

ఇంద్ర:—(హర్షముతో) అట్లేయగుఁగాక! కర్ణా! ఇపుడే, ఇమ్ము, ఇమ్ము. ఏ నరుదెంచి చాలతడ వయినది.

కర్ణ:—(స్వగ.) ఓహో! దీనికొఱకే ఇతఁడు వచ్చినట్లున్నది. చీ, చీ, ఆ కృష్ణుని కపటోపాయములలో నిదియు నొక్కటియగుఁ గాక! ఏనేల దీనింగూర్చి కడుంగడు దీర్ఘముగ నాలోచించుచుఁ గూరుచుండవలయు? ఇంతకు దీనింగూర్చి సంశ యించుట కేమున్నది? (ప్రకాశముగ) విప్రోత్తమా! నీవు కోరినట్లు కవచకుండలములే చేకొందువుగాక!

శల్య:—అంగరాజా! ఈదాన మనుచితము. ఏమాత్రముఁ దగదు.

కర్ణ:—శల్యరాజా! నన్ను వారింతు వేల? పరిశీలింపుము.

తే. చదువులు నశించుఁ గాలము జరుగుకొలఁది,
వ్రేళ్ల బిగిగలవృక్షములు పృథివిఁ గూలు,
బహు జలాధారములుగూడ వట్టిపోవు,
హుతము దత్తము నిల్చు శాశ్వతముగాఁగ.

కావునఁ గవచకుండలములుమాట దప్పక యిచ్చితీరుదును. (బ్రాహ్మణాకారమున నున్న యింద్రునివంకఁ దిరిగి) ద్విజ వరేణ్యా! ఇవిగో! కవచకుండలములు గ్రహింపుము. (కవచ కుండలము లూడ్చియిచ్చును.)

ఇంద్రః—(తీసికొని, స్వగతము నాయభిమత మీడేఱినది. పూర్వము సవ్యసాచికి గెలుపుగలుగునిమిత్తమే మొనర్ప నిర్ణయించి కొంటినో అది స్వయముగ, నేనే, నేఁడు నెఱవేర్పఁగలిగితి. కావున నే నిఁక వెడలి ఐరావత మారోహించి కర్ణార్జునుల యుద్ధమును దిలకింతుఁగాక!

(ఇంద్రుఁడు నిష్క్రమించును.)

శల్యః—అంగరాజా! మోసగింపఁబడితివిగదా?

కర్ణః—ఎవనిచే?

శల్యః—ఇంద్రునిచే.

కర్ణః—అట్లు కాదు. ఇంద్రుఁడే నాచే మోసగింపఁబడియె. ఏల యన,

తే. ద్విజకృతానేక యజ్ఞసంతృప్తుఁడు, హత
దనుజనిచయుఁడు, సర్వమూర్ధన్యశాస్త్ర,
సురగజాస్ఫాలనకఠినతరకరుండు
పాకరిపుఁడె నిజంబుగ వంచితుండు.

(దేవదూత యొకఁడు బ్రాహ్మణరూపమునఁ బ్రవేశించి) ఓయి! కర్ణ! కవచకుండలములు చేకొనుటచేతఁ గలిగిన పశ్చాత్తాపముకతనఁ బురందరుచే ననుగ్రహింపఁబడితివి. పాండవేయులందు ఏయొక్కనినేని వధించుటలో నమోఘ మును 'విమలా'ఖ్యము నగు ఈశక్తి నాతఁడు నామూలా ముగఁ బంపెను. దీనిం బరిగ్రహింపుము.

కర్ణః—ఇస్సీ! ఇచ్చినదానికి బదులుగ నేను మ తేదియు గ్రహింపను.

దేవః—బ్రాహ్మణవచనానుసారము పరిగ్రహింపఁదగును.

దేవ:—బ్రాహ్మణ వచనానుసారము పరిగ్రహింపఁదగును.

కర్ణ:—బ్రాహ్మణవచనమా? ఇంతవఱకు నేను విప్రవాక్యము నుల్లంఘించినవాఁడఁ గాను. నా కాశక్త్యాయుధ మెపు డెట్లు చేపడుదును?

దేవ:—ఎపుడు స్మరింతువో యపుడు తనంత నది నీచేతికి వచ్చును.

కర్ణ:—మంచిది. అనుగ్రహింపఁబడితిని. ఆర్యా! నీ విఁక మరలి యరుగఁదగును.

దేవ:—అట్లే కావింతును. (దేవదూత వెడలిచనును.)

కర్ణ:—శల్యరాజా! మన మిఁక రథ మారోహింతమా?

శల్య:—అభ్యంతర మేమి? ఇఁక సమరసన్నాహమే యుచితము.

(ఇరువురును రథారూఢు లగుదురు.)

కర్ణ:—మద్రేశా! ఏదియో శబ్దము వినవచ్చెడు. అ దెద్దియో?

తే. శంఖరవముల నబ్ధి ఘోషమ్ముఁబోలె
నడరు, నిది కృష్ణునిదిగాదు, యర్జునునిదె,
ధర్మజ పరాజయమునఁ గ్రోధమ్ము గదిరి
బలముకోలఁదిఁ బోరాడఁ గవ్వడియ వచ్చె.

శల్యరాజా! ఆపార్థుఁ డున్న దిక్కునకే సూటిగ మనతేరం బోనిమ్ము.

శల్య:—అట్లే యొనర్తును.

భరతవాక్యము.

క. ఎల్లెడ సంపద లెసఁగుత
వెల్లగు నాపదచయంబు పీడ్కొనుత, ధరా
వల్లభుఁడు నృపతిసుగుణ స
ముల్లసితుఁడు మనప్రభుండె యోముత నుర్విన్.

(నిష్క్రమింతురు.)

ఇది
(కర్ణభారము అవసితము.)

ఇతరకృతులలో భాసమహాకవి ప్రణీతములుగఁ బ్రసిద్ధికెక్కినవియు, భాసనాటకచక్రములోని యేరూపకములోను గనఁబడనివియు నగు

శ్లోకములు

దగ్ధేమనో భవతరౌ, బాలాకుచకుంభసంభృతైరమృతైః,
త్రివలీకృతాలవాలా, జాతారోమావలీవల్లీ. 1

(సదుక్తికర్ణామృతమ్.)

పేయాసురా ప్రియతమాముఖ మీక్షణీయం
గ్రాహ్యాః స్వభావలలితో వికటశ్చవేషః,
యేనేద మీదృశమదృశ్యత మోక్షవర్త్మా
దీర్ఘాయురస్తు, భగవాన్ సపినాకపాణిః. 2

తీక్ష్ణం రవిస్తపతి నీచఇవా చిరాఢ్యః
శృఙ్గం రురుస్త్యజతి మిత్రమివా కృతజ్ఞః,
తోయం ప్రసీదతి మునేరివ చిత్తవృత్తిః
కామం దరిద్ర ఇవ శోషముపైతి పఙ్కః. 3

(శార్ఙ్గధరపద్ధతి.)

బాలాచ సా విదితపఞ్చశర ప్రపఞ్చా
తన్వీచ సా స్తనభరోపచితాఙ్గయష్టిః,
లజ్జాం సముద్వహతి సాసురతావసానే
హా, కాపి సా కిమివ కింకథయామి తస్యాః. 4

(సుభాషితావళి.)

కపాలే మార్జారః పయ ఇవకరాంల్లేఢి శశినః
తరుచ్ఛిద్రప్రోతాన్ బిసమితి కరీ సంకలయతి,

రతాన్తే తల్పస్థా హరతి వనితాప్యంశుకమితి
ప్రభామత్తశ్చంద్రో జగదిదమహో విప్లవయతి. 5

(శార్ఙ్గధరపద్ధతి.)

కఠినహృదయే ముఞ్చ క్రోధం సుఖప్రతిఘాతకమ్
లిఖతి దివసం యాతం యాతం యమఃకిలమానిని,
వయసి తరుణే నైతద్యుక్తం చలే చ సమాగమే
భవతికలహోయావత్తావద్వరం సుభగేరతమ్. 6

(సుభాషితావళి.)

కృతకకృతకై ర్మాయాసఖ్యైః త్వయాస్మృతి వఞ్చితా
నిభృతనిభృతైః కార్యాలాపైః మయాప్యుపలక్షితమ్,
భవతు విదితం నేష్టాహం తే వృథాకిముఖిద్యసే
హ్యాహమ సహానాత్వాం నిః స్నేహః సమేన సమం గతమ్. 7

(సుభాషితావళి.)

విరహివనితా వక్త్రౌపమ్యం బిభర్తి నిశాపతిః
గలితవిభవస్యాజ్ఞే వాద్యద్యుతి ర్మసృణారవేః,
అభినవ వధూరోష స్వాదుః కరీషతనూనపా
దసరళజనాశ్లేష క్రూరస్తుషార సమీరణః. 8

(సదుక్తికర్ణామృతమ్.)

యదపి విబుధైః సిన్ధోరన్తః కథంచిదుపార్జితమ్
తదపి సకలం చారుస్త్రీణాం ముఖేషు విలోక్యతే,
సురసుమనసః| శ్వాసామోదేశశీచకపోలయోః
అమృతమధరే తిర్యగ్భూతే విషం చ విలోచనే. 9

(సూక్తిముక్తావళి.)

దుఃఖార్తే మయి దుఃఖితా భవతి యాప్రహృష్టా తథా
దీనే దైన్యముపైతి రోషపరుషే పథ్యం వచోభాషతే,

కాలం వేత్తి కథాః కరోతి నిపుణామత్సం స్తవే రజ్యతి
భార్యామన్త్రివరస్సఖాపరిజనః సైకాబహుత్వంగతాః. 10

(సుభాషితావళి,)

ప్రత్యాసన్న వివాహమంగళవిధౌ దేవార్చనవ్యగ్రయా
దృష్ట్వాగ్రే పరిణేతురేవ లిఖితాం గఙ్గాధరస్యాకృతిమ్,
ఉన్మాదస్మితరోషలజ్జితరసైర్గౌర్యాం కథంచిచ్చిరా
ద్వ్యర్ధః స్త్రీవచనాత్ప్రియే వినిహితః పుష్పాంజలిః పాతు వః. 11

(సదుక్తికర్ణామృతమ్.)

అస్యా లలాటే రచితా సఖీభిః విభావ్యతే చన్దనపత్రలేఖా,
ఆపాణ్డురక్షామకపోలభిత్తావనఙ్గబాణవ్రణపట్టికేవ. 12

దయితా బాహుపాశస్యకుతోఽయమపరోఽవిధిః,
జీవయత్యర్పితః కణ్ఠే మారయత్యపవర్జితః. 13

(శార్ఙ్గధరపద్ధతి.)

సర్వస్వామ్యములు ఆంధ్రీకర్తవి. క్రోధి, జ్యేష్ఠము.
మొదటికూర్పు 1000 ప్రతులు.

శ్రీ శర్మగారి తక్కినకృతులు

		రూ. పై.
కుందమాల (దిఙ్నాగుని నాటకమున కాంధ్రీకరణము.)	...	2-50
శ్రీరామ (లక్ష్మీస్వభావవర్ణనము.)	...	0-37
భామినీవిలాసము (పండితరాయలకృతికి తెనిఁగింపు.)	...	3-00
శ్రీసోమశేఖరీయము (నీలకంఠదీక్షిత సభారంజనశతకానువాదము.)	...	0-31
శ్రీకృష్ణకవీయము (నీలకంఠదీక్షిత కలివిడంబనానువాదము.)	...	0-31
శతకవాఙ్మయసర్వస్వము (శతకకవులచరిత్ర.)	...	7-50
శ్రీఆంజనేయకవీయము (క్షేమేంద్రుని చారుచర్యాంధ్రీకృతి.)	...	0-31
ఊరుభంగము (భాసకవినాటికకు తెనిఁగింపు.)	...	0-75
సెహబ్రికావ్యము	...	2-75
భక్తవత్సలశతకము	...	0-31
తేనెసోనలు (చాటువులు, ప్రాస్తావికములు, ఖండికలు) 3 భాగములు, భాగము 1-కి	...	1-25
బాలభారతము (రాజశేఖరకృతి కనువాదము.)	...	2-00
అభినవాంధ్రకాదంబరి	...	1-50
బాలచరితము (భాసకృతి కనువాదము.)	...	2-75

వలయువారు ఈక్రిందిచిరునామాకు వ్రాయుఁడు:—

శ్రీవి. వి. కే. శర్మ,
C/O ఉదయరంజనీ పబ్లిషర్సు,
11, సామిపిళ్లైవీథి, చూళ, మదరాసు